E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 15-05-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




పాకిస్తాన్‌కు ఉహించని షాక్.. స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్న బలూచిస్తాన్ » 3లో

## కొత్త సీజేఐగా బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం



ఈ-కబురు, : భారత అత్యున్నత న్యాయస్థానం 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రితోపాటు, కేంద్ర మంత్రులు, ఇతర అతిథుల సమక్షంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గవాయ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ఏడాది నవంబర్ 23న ఆయ పదవీ కాలం ముగిసే వరకు బాధ్యతలు చేపట్టనున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించే రెండో దళిత వ్యక్తిగా జస్టిస్ గవాయ్ చరిత్ర సృష్టించారు. ఇదివరకు 2007లో దేశ అత్యున్నత న్యాయ పదవిని చేపట్టిన మొదటి దళితుడిగా కేజి బాలకృష్ణన్ నిలిచారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ జస్టిస్ గవాయ్‌కు అభినందనలు తెలిపారు.

తరువాయి 2లో



## మన భార్గవాస్త్రం సిద్ధం.. శత్రు డ్రోన్ల దండుకు గండం..!

*డ్రోన్ల సమూహాన్ని పక్కాగా ఛేదించే స్వదేశీ కౌంటర్ డ్రోన్ సిస్టమ్ 'భార్గవాస్త్ర'ను విజయవంతంగా పరీక్షించారు.*

*ఈ-కబురు, : సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో తేలికగా అందుబాటులో ఉంటున్న డ్రోన్లు.. దేశ భద్రతకు సవాళ్లుగా మారుతున్నాయి. మొన్నటికి మొన్న భారత్‌తో ఉద్రిక్తతల సమయంలో పాక్ మన దేశంపైకి భారీ ఎత్తున డ్రోన్లతో దాడులు చేయగా..* తరువాయి 2లో

## కట్టిన మూడేళ్లకే కూలింది: సీఎం రేవంత్



కట్టిన మూడేళ్లకే కూలింది: సీఎం రేవంత్

ఈ భూ ప్రపంచంలో ఇలాంటి ప్రాజెక్టు కాళేశ్వరం ఒక్కటే

నిజాం, నెహ్రూలు కట్టిన జలాశయాలు నేటికీ చెక్కు చెదరలేదు

ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందంటూ నిలదీత

నీళ్లు నాగరికతను నేర్పుతాయి.. తెలంగాణ ప్రజలకు ఉద్యమాన్ని నేర్పాయని వ్యాఖ్య

నీటిపారుదల శాఖలో కొత్త ఏఈలు సహా 423 మందికి నియామక పత్రాలు అందజేత

రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం కట్టినా 50 వేల ఎకరాలకు కూడా నీరివ్వలేదు: సీఎం రేవంత్‌రెడ్డి

పదేళ్లలో రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెట్టినా..ఉమ్మడి రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కాలేదు

ఈకబురు, హైదరాబాద్: ఈ భూ ప్రపంచంలో కట్టిన మూడేళ్లకే కుప్పకూలిన ప్రాజెక్టు ఏదైనా ఉందంటే అది కాళేశ్వరం ఒక్కటే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. నిజాం కాలంలో మూసీ నదిపై కట్టిన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌తో పాటు జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో నిర్మించిన శ్రీరాం సాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి సాగునీటి ప్రాజెక్టులు ఎన్ని ఉపద్రవాలు వచ్చినా ఇప్పటికీ చెక్కు చెదరలేదని చెప్పారు. కానీ మూడేళ్లలోనే కాళేశ్వరం.. కట్టడం, కూలడం రెండూ జరిగిపోయాయని అన్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టినా 50 వేల ఎకరాలకు కూడా నీరివ్వలేదని విమర్శించారు. నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్లుగా, టెక్నికల్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు పొందిన 423 మందికి బుధవారం జలసౌధలో జరిగిన కార్యక్రమంలో సీఎం నియామక పత్రాలు అందజేశారు.

తరువాయి 2లో

## కర్రెగుట్ట ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మృతి: డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం

*తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు బీజాపూర్ జిల్లా ఉసురు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్రెగుట్ట కేంద్రంగా జరిగిన ఆపరేషన్‌లో 31మంది మావోయిస్టులు మృతి చెందినట్లు సీఆర్పీఎఫ్ డీజీ జీపీ సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం తెలిపారు.*

తరువాయి 2లో




## భద్రతా బలగాలను చూసి దేశం గర్విస్తోంది.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా



ఈ-కబురు, : కర్రెగుట్ట ఎన్ కౌంటర్‌లో భద్రతా బలగాలు సాధించిన విజయం పట్ల కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లో ఇదొక చారిత్రాత్మక విజయమని అభివర్ణించారు. » 2లో

## సీఎం రేవంత్‌వి అవే అబద్ధాలు



కొత్త ఉద్యోగులకు నియామక పత్రాలు అందిస్తూ నాలుగు మంచి మాటలు చెప్పాల్సింది పోయి.. యథావిధిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు వల్లె వేశారని భారాస సీనియర్ నేత హరీశ్‌రావు ధ్వజమెత్తారు. » 3లో

నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం.. ఇకపై లెఫ్టినెంట్ కల్నల్‌గా » 6లో



దిగొచ్చిన బంగారం ధర! తులం ఎంతంటే.. » 4లో



'కింగ్‌డమ్' వాయిదా.. కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడంటే! » 5లో






నౌకలో 21 మంది పాక్ సిబ్బంది.. ఆ పోర్టులో హైఅలర్ట్! » 2లో



త్వరలోనే 'గ్రూప్స్' ఉద్యోగ నియామకాలు: సీఎం రేవంత్‌రెడ్డి » 3లో



సిందూర్'ను రాజకీయం చేస్తున్న భాజపా » 3లో

## 'కృష్ణా జలాల్లో ఏపీకి 30, తెలంగాణకు 70 శాతం వాటాకు పట్టుబట్టండి'




వర్షా కాలం సమీపిస్తుండడంతో కృష్ణా జలాల్లో వాటాపై మరోసారి తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. కృష్ణా జలాల్లో వాటా కోసం ప్రయత్నాలు తీవ్ర చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశించింది. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఇలా ఉన్నాయి.

ఈ-కబురు, :'కృష్ణా జలాల్లో ఏపీకి 30, తెలంగాణకు 70 శాతం వాటాకు పట్టుబట్టండి' కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధంగా రావాల్సిన వాటాల సాధనకు చేస్తున్న ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రయోజనాలను అత్యంత ప్రాధాన్యంగా గుర్తించాలని సూచించారు. కృష్ణా నది పరివాహక ప్రాంతం సుమారు 70 శాతం తెలంగాణలో ఉంటే కేవలం 30 శాతం మాత్రమే ఏపీలో ఉండడంతో కృష్ణా జలాల్లో 70 శాతం వాటా తెచ్చుకునేలా ట్రిబ్యునల్ ఎదుట పట్టుబట్టాలని స్పష్టం చేశారు.

తరువాయి 2లో

## తెలుగు అమ్మాయిల్లా.. అందాల తారలు

ఈ కబురు, వరంగల్: పట్టు పరికిణీలు, చీరలు కట్టుకొని తెలుగుదనం ఉట్టిపడేలా తిలకం దిద్దుకున్న ప్రపంచ దేశాల సుందరీమణులు ఓరుగల్లు పర్యటనలో జిగేల్‌మన్నారు. హెరిటేజ్ వాక్‌లో భాగంగా వివిధ దేశాలకు చెందిన 57 మంది సుందరీమణులు రెండు బృందాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. వరంగల్ కోట సందర్శనలో 22 మంది బుధవారం సాయంత్రం హనుమకొండకు చేరుకున్నారు. మరో బృందం ములుగు జిల్లా రామప్పలో సందడి చేసింది.



» 3లో



## ఉద్రిక్తతలు తగ్గాలంటే భారత్-పాకిస్థాన్ కలిసి డిన్నర్ చేయాలి.. ట్రంప్ నోట మళ్లీ అదే పాట

*భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి తానే కారణమంటూ పేర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. మళ్లీ అదేతరహాలో వ్యాఖ్యలు చేశారు.*

ఈ-కబురు, : భారత్-పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తానే కారణమంటూ పేర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అదే పాట పాడారు. ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికి ఇరుదేశాలు కలిసి మంచి డిన్నర్ ఏర్పాటుచేసుకోవాలని తాజాగా సూచించారు. అణుక్షిపణులతో యుద్ధాలు వద్దని కోరారు. సౌదీ అరేబియాలో మాట్లాడుతూ తనను తాను శాంతికర్తగా అభివర్ణించుకున్న ట్రంప్.. రెండు అణ్వాయుధ దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నించినట్లు చెప్పారు.

తరువాయి 2లో

## పరిశుభ్ర వాతావరణంతోనే ప్రశాంత జీవనం : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



కేశవ నగర్ లో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

### కేశవ నగర్ లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

ఈకబురు, శేరిలింగంపల్లి : పరిశుభ్రమైన వాతావరణంతోనే ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతుందని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యాధులను అధిగమించేందుకు జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం చేపడుతున్న చర్యల్లో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని కేశవనగర్ లో బుధవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బంది, స్థానిక నాయకులు, బస్తీ వాసులతో కలిసి గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశవ నగర్ లో ఉన్న మట్టి కుప్పలను జేసీబీలతో లెవలింగ్ చేసి, రోడ్డుపక్కన డంప్ చేసిన చెత్తను తొలగించడం, ఎండిపోయిన చెట్ల కొమ్మలను తీసివేయడం, రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి చెట్లను, చెత్తా చెదారాన్ని శానిటేషన్ వర్కర్స్ తో తొలగించి శుభ్రం చేయించారు. అనంతరం కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ వ్యాధుల వ్యాప్తి మొత్తం అపరిశుభ్రమైన వాతావరణం కారణంగానే జరుగుతుందని అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే సమాజం శుభ్రంగా ఉంటుందన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా రోడ్లు, నాలాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడానికి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఈశ్వర్, తిరుపతి, సుమన్, నగేష్, రాజు, శ్రీను, యాదయ్య, గోవింద్, హనుమంతు, జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బంది కృష్ణ ,మల్లేష్, కేశవ నగర్ వాసులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాకిస్తాన్‌కు ఊహించని షాక్.. స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్న బలూచిస్తాన్




ఈకబురు, : భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా జోక్యంతో కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. పాక్ పై భారత్ మెరుపుదాడులకు పాక్‌కు చావు తప్పి కన్నులొట్ట పోయినట్లు అయింది. దీని నుంచి తేరుకునే లోపు పాకిస్తాన్‌కు మరో షాక్ తగలింది. గత కొంతకాలంగా తమను ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయాలని పాక్ పై తిరుగుబాటు చేస్తున్న బలూచ్ తెగల వారు.. ఎవరూ ఊహించని విధంగా స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బలూచిస్తాన్ , పాకిస్తాన్‌లోని పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఒక ప్రావిన్స్, దీర్ఘకాలంగా స్వాతంత్ర ఉద్యమాలకు కేంద్రంగా ఉంది. గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్.. 48 మంది మృతి బలూచ్ ప్రజలు తమ సహజ వనరుల దోపిడీ, రాజకీయ హక్కుల కొరత, పాకిస్తాన్ సైన్యం చేస్తున్న అణచివేతలపై ఆరోపణలు చేస్తూ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారు. బలూచ్ లిబరేషన్ ఆర్మీ ఈ ఉద్యమంలో ప్రముఖ సాయుధ సంస్థగా ఉంది. ఇది పాకిస్తాన్ సైన్యం , మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తూ స్వతంత్ర బలూచిస్తాన్ కోసం పోరాడుతోంది. ఈ క్రమంలోనే నేడు స్వతంత్ర దేశం గా అవతరించినట్లు స్వయంగా ప్రకటించుకుంది. అలాగే నూతన ప్రభుత్వ ఏర్పాటుకు తాము కసరత్తు చేస్తున్నామని క్వెట్టాలో కొత్త పార్లమెంట్ కు ఫోటోలు, జాతీయ చిహ్నం, జాతీయ గీతానికి సంబంధించిన వీడియోను బలూచిస్తాన్ విడుదల చేసింది. అలాగే భారత్ సహా ఇతర దేశాలు తమ కొత్త బలూచిస్తాన్ దేశానికి వచ్చి ఎంబసీలు ఏర్పాటు చేయాలని కోరింది.

## త్వరలోనే ‘గ్రూప్స్’ ఉద్యోగ నియామకాలు: సీఎం రేవంత్‌రెడ్డి



**ప్రాజెక్టుల నాణ్యత విషయంలో ఇంజినీర్లు ఎవరి ఒత్తిళ్లకు లొంగవద్దని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కొలువుల పండుగ కార్యక్రమంలో నీటిపారుదల శాఖలో ఏఈ, జేటీవో పోస్టులకు ఎంపికైన వారికి సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.**

హైదరాబాద్: ప్రాజెక్టుల నాణ్యత విషయంలో ఇంజినీర్లు ఎవరి ఒత్తిళ్లకు లొంగవద్దని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కొలువుల పండుగ కార్యక్రమంలో నీటిపారుదల శాఖలో ఏఈ, జేటీవో పోస్టులకు ఎంపికైన వారికి సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.

‘‘ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి ఎప్పుడూ ప్రాధాన్యత ఇచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలోనే ఏపీలో భారీ ప్రాజెక్టులకు నెహ్రూ శంకుస్థాపన చేశారు. నెహ్రూ శంకుస్థాపన చేసిన నాగార్జునసాగర్, శ్రీశైలంతోనే మనకు నీళ్లు అందుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం 50, 60 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టులే ఈనాటికి మనకు నీళ్లు ఇస్తున్నాయి. నాగార్జున సాగర్, శ్రీరామ్‌సాగర్ ఎన్నో వరదలు, ఉపద్రవాలను తట్టుకుని నిలబడ్డాయి. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం మాత్రం మూడేళ్లలోనే కూలింది. కట్టిన మూడేళ్లలోనే కూలిన ప్రాజెక్టు ప్రపంచంలో మరెక్కడా లేదు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరంతో అదనంగా వెయ్యి ఎకరాలకు కూడా నీరు అందలేదు. కనీసం మట్టి పరీక్షలు కూడా చేయకుండా ప్రాజెక్టు నిర్మించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌ది’’ అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.

ఎస్ఎల్‌బీసీ, సీతారామ, దేవాదుల, నెట్టెంపాడు, సమ్మక్క సారక్క ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేస్తామన్నారు. గ్రూప్ 1 నియామకాలు అడ్డుకోవడం వెనుక ఉన్న రాజకీయ నాయకులు ఎవరో ప్రజలకు తెలుసన్నారు. త్వరలోనే గ్రూప్స్ నియామకాలు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## సీఎం రేవంత్‌వి అవే అబద్ధాలు



ఈకబురు: హైదరాబాద్: కొత్త ఉద్యోగులకు నియామక పత్రాలు అందిస్తూ నాలుగు మంచి మాటలు చెప్పాల్సింది పోయి.. యథావిధిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు వల్లె వేశారని భారాస సీనియర్ నేత హరీశ్‌రావు ధ్వజమెత్తారు. భారాస ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌కు నియామక పత్రాలు అందించి, తమ ఘనతగా చెప్పుకొనేందుకు తంటాలు పడ్డారని వ్యాఖ్యానించారు. నీటిపారుదలశాఖలో ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బుధవారం ఒక ప్రకటనలో హరీశ్‌రావు స్పందించారు. ‘‘ఉద్యోగాల్లో చేరుతున్న వారిలో ఉత్సాహాన్ని నింపాల్సింది పోయి.. వార్నింగ్ ఇచ్చి, సీఎం వారిని భయభ్రాంతులకు గురిచేశారు. అధికారులను ఉరి తీయాలని విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికలు చెబుతాయా? ఇది ప్రజాస్వామ్యమా? లేక రేవంత్ రాచరిక రాజ్యమా? రాజకీయ నాయకుల సూచనలు పాటిస్తే.. ఊచలు లెక్కపెడతారని ఇంజినీర్లను హెచ్చరిస్తున్న రేవంత్‌రెడ్డి.. ఏ జ్ఞానంతో కాళేశ్వరం కూలిందని దుష్ప్రచారం చేస్తున్నారు? రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయని.. ప్రాజెక్టు కుప్పకూలిందనేది పూర్తి అబద్ధమని ఎన్‌డీఎస్ఏ నివేదిక తేటతెల్లం చేసినా.. రేవంత్ తీరు మారకపోవడం గమనార్హం. మూడు నెలలు కావస్తున్నా ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కూరుకుపోయిన వారి జీవితాలు గుర్తుకురావడం లేదా? తొమ్మిదిన్నరేళ్ల భారాస పాలనలో రూ.3,900 కోట్లు ఖర్చు చేసి.. 12 కిలోమీటర్ల టన్నెల్ పనులు పూర్తి చేసింది వాస్తవం కాదా? దీనిపై చర్చకు సిద్ధమా? ఏడాదిన్నరపాటు నీటిపారుదల రంగాన్ని నిర్లక్ష్యం చేసి.. ఇప్పుడు ధాన్యరంగమని చెబుతుండటం హాస్యాస్పదం. మీ 18 నెలల పాలనలో కొత్తగా ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలి’’ అని హరీశ్ డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

రాష్ట్రంలో ఏ కొనుగోలు కేంద్రం వద్ద చూసినా రైతన్నల కన్నీటి గాథలే కనిపిస్తున్నాయని హరీశ్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ‘ఆరుగాలం శ్రమించి పండించిన పంట గాలి వానకు తడిసి ముద్ద అయితే అన్నదాతకు ఎంత యాతన? ఎంత కడుపు కోత? ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇవ్వాలి. కొనుగోళ్లు వేగంగా జరిపి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి’ అని డిమాండ్ చేశారు.

## సిందూర్’ను రాజకీయం చేస్తున్న భాజపా

***‘ఆపరేషన్ సిందూర్’ను భాజపా రాజకీయం చేస్తోందని కాంగ్రెస్ బుధవారం ఆరోపించింది. భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించానన్న అమెరికా అధ్యక్షుడి ప్రకటనపై ప్రధాని మోదీ మౌనం పాటిస్తుండటాన్ని ప్రశ్నించింది.***

ఈ కబురు: దిల్లీ: ‘ఆపరేషన్ సిందూర్’ను భాజపా రాజకీయం చేస్తోందని కాంగ్రెస్ బుధవారం ఆరోపించింది. భారత్‌పాక్‌ల మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించానన్న అమెరికా అధ్యక్షుడి ప్రకటనపై ప్రధాని మోదీ మౌనం పాటిస్తుండటాన్ని ప్రశ్నించింది. మోదీ వైఖరికి నిరసనగా దేశవ్యాప్తంగా జై హింద్ ర్యాలీలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పలువురు సీడబ్ల్యూసీ సభ్యులు, సీనియర్ నేతలు బుధవారం సమావేశమయ్యారు. దీనికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శులు జైరాం రమేశ్, ప్రియాంకాగాంధీ, కె.సి.వేణుగోపాల్ తదితరులు హాజరయ్యారు. వ్యక్తిగత కారణాలతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ సమావేశానికి హాజరుకాలేదు. పహల్గాం దాడి.. నిఘా వైఫల్యంపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్న తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. పహల్గాం దాడికి కారకులైన ఉగ్రవాదులను త్వరగా పట్టుకుని విచారించాలని సీడబ్ల్యూసీ డిమాండ్ చేసింది. పహల్గాంలో భద్రతా లోపాలకు దారితీసిన పరిస్థితులపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరింది. భేటీ అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విలేకరులతో మాట్లాడారు.కేంద్రం, భాజపాల నుంచి సమాధానాలు డిమాండ్ చేస్తూ రాబోయే రోజుల్లో వివిధ రాష్ట్రాల్లో ‘జైహింద్ సభ, ర్యాలీ’లను నిర్వహిస్తామన్నారు.

**లక్ష్మణరేఖను దాటిన థరూర్**

ఈ భేటీ అనంతరం పార్టీ వర్గాలు శశిథరూర్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశాయి. ‘‘కాంగ్రెస్ ఓ ప్రజాస్వామ్య పార్టీ. నేతలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరుస్తారు. కానీ, శశిథరూర్ ఈసారి లక్ష్మణ రేఖ దాటారు. ఈ క్రమంలోనే వ్యక్తిగత అభిప్రాయాల వెల్లడికి ఇది సమయం కాదని, పార్టీ వైఖరికి కట్టుబడి ఉండాలని తాజా సమావేశంలో అధిష్ఠానం సైతం ఎవరి పేరు ఎత్తకుండానే స్పష్టం చేసింది’’ అని తెలిపాయి.

**అనవసర ప్రశ్నలకు దూరంగా ఉండండి**
**- కాంగ్రెస్‌కు భాజపా సూచన**

దిల్లీ: ఆపరేషన్ సిందూర్‌పై అనేక సందేహాలు లేవనెత్తుతున్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలపై భాజపా బుధవారం తీవ్రంగా విరుచుకుపడింది. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని, ప్రస్తుతానికి తాత్కాలికంగా నిలిచిందని..ఈ అంశంపై అనవసరపు, అసమంజసమైన ప్రశ్నలకు దూరంగా ఉండాలని హితవు పలికింది. రాజ్యసభ సభ్యుడు, పార్టీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఎక్కడా ‘కాల్పుల విరమణ’ పదాన్ని ఉపయోగించలేదని తెలిపారు. ద్వైపాక్షిక చర్చల ద్వారా పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ సమస్య పరిష్కారం కావాలని స్పష్టం చేసిందని చెప్పారు.



## పాక్ అదుపులోని బీఎస్ఎఫ్ జవాన్ విడుదల

**పాక్ రేంజర్ల నిర్బంధంలో గత 21 రోజులుగా ఉన్న సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్ పూర్ణమ్ కుమార్ సాహూ బుధవారం ఉదయం 10.30 గంటలకు విడుదలయ్యారు.**

అమృత్‌సర్: పాక్ రేంజర్ల నిర్బంధంలో గత 21 రోజులుగా ఉన్న సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్ పూర్ణమ్ కుమార్ సాహూ బుధవారం ఉదయం 10.30 గంటలకు విడుదలయ్యారు. పంజాబ్‌లోని అటారీ సరిహద్దు వద్ద ఆయన్ను పాక్ రేంజర్లు బీఎస్ఎఫ్‌కు అప్పగించారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రైతులకు రక్షణగా గత నెల 23న గస్తీ నిర్వహిస్తున్న సమయంలో పూర్ణమ్ అస్వస్థతకు గురయ్యారు. సమీపంలో ఓ చెట్టు కనబడటంతో దానికింద విశ్రాంతి తీసుకున్నారు. అది పాక్ భూభాగం అన్న విషయాన్ని గుర్తించలేకపోయారు. పాకిస్థాన్ రేంజర్స్ ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. జవాన్ విడుదల కోసం రెండు దేశాల భద్రతా దళాలు ఆరు సార్లు చర్చలు జరిపాయి. మరోవైపు పూర్ణమ్ కుటుంబసభ్యులు తీవ్రంగా ఆందోళన చెందారు. గర్భిణి అయిన ఆయన భార్య.. భర్త విడుదల కోసం కేంద్రాన్ని వేడుకున్నారు. కొన్నాళ్లపాటు భారత్ అధికారుల అభ్యర్థనలు పట్టించుకోకుండా పాక్ రేంజర్లు కాలయాపన చేశారు. అయితే ఈ నెల మొదటివారంలో రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలో మన భూభాగంలోకి ప్రవేశించిన పాక్ రేంజర్ మహమ్మదుల్లాను బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకుంది. దీంతో పాకిస్థాన్‌పైనా ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలోనే పూర్ణమ్‌ను విడుదల చేసింది. బీఎస్ఎఫ్ కూడా పాక్ రేంజర్‌ను అప్పగించింది. పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీ జిల్లాకు చెందిన సాహూ విడుదలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి

## తెలుగు అమ్మాయిల్లా.. అందాల తారలు



సుందరీమణులకు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు, సంప్రదాయ డోలు వాయిద్యాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళలతో కలిసి బతుకమ్మ పాటలకు సుందరీమణులు నృత్యాలు చేశారు. అనంతరం సంప్రదాయ ప్రకారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన



తాంబాలంలోని చెంబులో ఉన్న నీళ్లతో సుందరీమణులు కాళ్లను కడుక్కున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న నంది విగ్రహం వద్ద ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. అనంతరం కల్యాణ మంటపాన్ని దర్శించారు. అనంతరం ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన సుందరీమణులు వరంగల్ కోటను సందర్శించి అక్కడే ఏర్పాటు చేసిన పేరిణి శివతాండవం, ఇతర సంప్రదాయ నృత్యాలను చూసి తిరిగి హరిత హోటల్‌కు చేరుకుని డిన్నర్ చేసి హైదరాబాద్‌కు బయలుదేరారు. ములుగు జిల్లా రామప్ప ఆలయం వద్ద ప్రపంచ సుందరీమణులకు గుస్సాడీ నృత్య ప్రదర్శన, ఒగ్గుడోలు ప్రదర్శన ద్వారా కళాకారులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత చరిత్ర ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పురాతన కట్టడం, వారసత్వ సంపద.. రామప్ప ఆలయాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఆలయ తీరుతెన్నులను తనివితీరా తిలకించి ఫిదా అయ్యారు. రామప్ప గార్డెన్‌లో అలేఖ్య పుంజాల శాస్త్రీయ నత్యం, రంజిత్ బృందం పేరిణి ప్రదర్శనలను వీక్షించిన అనంతరం..ఇంటర్‌ప్రిటిషన్ సెంటర్‌లో డిన్నర్ చేసి హైదరాబాద్‌కు బయలుదేరారు.

**అతిథులకు మంత్రుల సన్మానం**

వరంగల్ కోటలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ సుందరీమణులకు స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ఓరుగల్లు నిలువెత్తు నిదర్శనమన్నారు. రామప్ప గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ సాంస్కృతిక చారిత్రక కట్టడాలకు నిలయం ములుగు ప్రాంతమని, ఇక్కడకు సుందరీమణులు రావడం సంతోషంగా ఉందన్నారు.

**వరంగల్ పర్యటన ఎప్పటికీ గుర్తుంటుంది**

చారిత్రక సంపదకు నెలవైన వరంగల్ పర్యటన మాకు జీవితాంతం గుర్తుండే అనుభూతి. కాకతీయులు నిర్మించిన వరంగల్ కోట అద్భుతంగా ఉంది. మాటల్లో దీన్ని వర్ణించలేం. రాణిరుద్రమదేవి గొప్పతనం ఇక్కడ కళ్లకు కట్టినట్టు కనిపించింది. కాకతీయుల పాలన గురించి తెలిపే సౌండ్ అండ్ లైట్ షో ప్రదర్శన మాకెంతో అవగాహన కలిగించింది.

ఇక్కడి ఆతిథ్యం మమ్మల్ని మురిపిస్తోంది. చేనేత కలంకారి డ్రెస్ చూస్తే ఇక్కడి గొప్పతనం తెలుస్తోంది. చపాట మిర్చి చూసేందుకు బాగా ఉంది. ఇంకా టేస్ట్ కూడా ఆ రేంజ్‌లోనే ఉందనుకుంటున్నాం. తెలంగాణ జరూర్ ఆనా నినాదాన్ని మా దేశంలో వినిపిస్తాం. -మిస్ వరల్డ్ పోటీదారులు





## మోస్తరు లాభాల్లో సూచీలు.. చెల్లించాల్సిందే!

**రాణించిన ఐటీ, మెటల్ స్టాక్స్ స్టాక్ మార్కెట్ సూచీలు మోస్తరు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 182, నిఫ్టీ 88 పాయింట్లు చొప్పన లాభపడ్డాయి.**

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మోస్తరు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో స్వల్ప లాభాలకు పరిమితమయ్యాయి. ముఖ్యంగా మెటల్, రియల్ ఎస్టేట్, టెక్నాలజీ స్టాక్స్ రాణించాయి. భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడం, రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించొచ్చన్న అంచనాలు ఇందుకు కారణం. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక శాతానికి పైగా లాభఢ్డాయి. సెన్సెక్స్ ఉదయం 81,278.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,148.22) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. 80,910.03 81,691.87 మధ్య కదలాడింది. చివరికి 182.34 పాయింట్ల లాభంతో 81,330.56 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 88.55 పాయింట్ల లాభంతో 24,666.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.27గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఎటర్నల్, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఏషియన్ పెయింట్స్, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 65.77 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3237 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## దిగొచ్చిన బంగారం ధర! తులం ఎంతంటే..

ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధర ఇటీవల ఒడిదొడుకులకు లోనవుతుంది. మంగళవారంతో పోలిస్తే బుధవారం పసిడి ధర తగ్గి కొనుగోలుదారులకు ఊరట కల్పించింది. వివిధ ప్రాంతాల్లో ఈ రోజు గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం.

హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.88,050 (22 క్యారెట్స్), రూ.96,060 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. మంగళవారం ధరలతో పోలిస్తే ఈ రోజు 10 గ్రాముల బంగారం ధర వరుసగా రూ.500, రూ.540 తగ్గింది.

చెన్నైలోబుధవారం 10గ్రాముల 22క్యారెట్లబంగారం ధరలు రూ.500, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.540 తగ్గింది. దీంతో గోల్డ్ రేటు రూ.88,050 (22 క్యారెట్స్ 10 గ్రామ్స్ గోల్డ్), రూ.96,060 (24 క్యారెట్స్ 10 గ్రామ్ గోల్డ్)కు చేరింది.

దేశ రాజధాని నగరం దిల్లీలో బంగారం ధర నిన్నటితో పోలిస్తే తగ్గింది. ఈ రోజు 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.500 దిగి రూ.88,200కు చేరుకోగా.. 24 క్యారెట్ల ధర రూ.540 తగ్గి రూ.96,210 వద్దకు చేరింది.

**వెండి ధరలు**

బంగారం ధరలు బుధవారం తగ్గినా వెండి ధరలు మాత్రం స్థిరంగానే ఉన్నాయి. మంగళవారం ముగింపు ధరలతో పోలిస్తే ఏమాత్రం కదలాడకుండా నిలకడగా ఉన్నాయి. దాంతో కేజీ వెండి రేటు రూ.1,09,000 వద్ద స్థిరంగా ఉంది.

## రాయల్ ఎన్‌ఫీల్డ్ విద్యుత్ మోటార్ సైకిల్.. ఈ ఏడాదే ఎంట్రీ!



రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో విడుదల కానుంది. ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ విద్యుత్ వాహన విభాగంలోకి ఎంట్రీకి సిద్ధమవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే విద్యుత్ మోటార్ సైకిల్‌ను విడుదల చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ మాతృసంస్థ ఐషర్ మోటార్స్ ఫలితాల వెల్లడి సందర్భంగా నిర్వహించిన ఎర్నింగ్స్ కాల్‌లో ఈ విషయాన్ని కంపెనీ సీఈఓ బి గోవింద రాజన్ వెల్లడించారు. ఫ్లయింగ్ ఫ్లీ అనే సబ్‌బ్రాండ్‌పై రాయల్ ఎన్‌ఫీల్డ్ ఈ వాహనాలను విడుదల చేయనుంది. ఫ్లయింగ్‌ఫ్లీ సీ6, ఎస్6 పేరిట వీటిని మార్కెట్లోకి తేనున్నారు. 2026 జనవరి మార్చి మధ్య సీ6ను లాంచ్ చేయనున్నారు. ఫలానా తేదీ అంటూ ఏదీ ప్రకటించలేదు. మొదట ఎస్6ని లాంచ్ చేయనున్నారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో యద్ధభూమిలో తేలికపాటి మోటార్ సైకిళ్లను వినియోగించే వారు. వాటిని ఫ్లయింగ్ ఫ్లీగా వ్యవహరించేవారు. అదే పేరును రాయల్ ఎన్‌ఫీల్డ్ తన విద్యుత్ వాహన సబ్‌బ్రాండ్‌కు పెట్టడం విశేషం. స్పెయిన్‌కు చెందిన ఈవీ బ్రాండ్ స్టార్క్ ఫ్యూచర్ ఈ వాహనాలకు బ్యాటరీ మేనేజ్‌మెంట్‌లో సహకారం అందిస్తుండగా.. క్వాల్‌కామ్ సంస్థ చిప్‌సెట్‌లను సమకూరుస్తోంది. మొత్తం 250 మంది రాయల్ ఎన్‌ఫీల్డ్ బృందం ఈ ప్రాజెక్ట్‌పై పనిచేస్తోంది. బ్యాటరీ, మోటార్ వివరాలు, ఇతర వాటి గురించి కంపెనీ వెల్లడించలేదు.

## ఆరేళ్ల కనిష్ఠానికి రిటెయిల్ ద్రవ్యోల్బణం



**వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటెయిల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది ఏప్రిల్‌లో 3.16 శాతానికి తగ్గింది. ఇది ఆరేళ్ల కనిష్ఠ స్థాయి. కూరగాయలు, పండ్లు, పప్పు ధాన్యాలు, ప్రోటీన్ ఉత్పత్తుల ధరలు తగ్గడమే ఇందుకు కారణం.**

**ఏప్రిల్‌లో 3.16%**
**తెలంగాణలో అత్యల్పంగా 1.26 శాతమే**

**దిల్లీ:** వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటెయిల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది ఏప్రిల్‌లో 3.16 శాతానికి తగ్గింది. ఇది ఆరేళ్ల కనిష్ఠ స్థాయి. కూరగాయలు, పండ్లు, పప్పు ధాన్యాలు, ప్రోటీన్ ఉత్పత్తుల ధరలు తగ్గడమే ఇందుకు కారణం. ఈ ఏడాది మార్చిలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 3.34% కాగా, 2024 ఏప్రిల్‌లో 4.83 శాతంగా ఉంది. 2019 జులైలో నమోదైన 3.15% తర్వాత గత నెలలోనే కనిష్ఠ స్థాయికి దిగి వచ్చింది. ద్రవ్యోల్బణం లక్షిత 4% కంటే దిగువనే ఉన్నందున, వచ్చే నెలలో జరగనున్న ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రేట్ల కోతకు దిగేందుకు అవకాశాలున్నాయి.

ఆహార ద్రవ్యోల్బణం గత నెలలో 91 బేసిస్ పాయింట్లు తగ్గి 1.78 శాతంగా నమోదైంది. 2021 అక్టోబరు తర్వాత ఇది కనిష్ఠ స్థాయి. 2025 మార్చిలో ఇది 2.69 శాతంగా, 2024 ఏప్రిల్‌లో 8.7 శాతంగా ఉంది. జాతీయ గణాంక కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం, కేరళలో అత్యధికంగా 5.94% ద్రవ్యోల్బణం నమోదైంది. తెలంగాణలో అత్యల్పంగా 1.26 శాతంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 2.59 శాతంగా ఉంది. దేశీయంగా గ్రామీణ ద్రవ్యోల్బణం 2.92% కాగా, పట్టణ ద్రవ్యోల్బణం 3.36 శాతంగా ఉంది. మార్చిలో ఇవి వరుసగా 3.25%, 3.43 శాతంగా నమోదయ్యాయి.

ఇప్పటికే తగ్గుతున్న వడ్డీరేట్లు: ఈ ఏడాదిలో నిర్వహించిన రెండు (ఫిబ్రవరి, ఏప్రిల్) పరపతి సమీక్షల్లో 25 బేసిస్ పాయింట్ల మేర రెపో రేట్ల కోత ప్రకటించింది. 202526లో రిటెయిల్ ద్రవ్యోల్బణ సగటు 4 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. ఏప్రిల్‌జూన్‌లో 3.6%, సెప్టెంబరు త్రైమాసికంలో 3.9%, డిసెంబరు త్రైమాసికంలో 3.8%, మార్చి త్రైమాసికంలో 4.4 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. తాజా గణాంకాలు ఇందుకు అనుగుణంగా ఉన్నాయి కనుక, రేట్ల కోతను వచ్చే నెల నుంచే ప్రారంభించొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## గూగుల్‌లో కొత్తగా ఏఐ మోడ్.. 'ఫీలింగ్ లక్కీ'కి గుడ్‌బై చెప్పేసినట్లేనా?

గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో కొత్తగా ఏఐ మోడ్ రాబోతోంది. దీంతో ఎన్నాళ్ల నుంచో ఉన్న 'ఫీలింగ్ లక్కీ' బటన్‌కు గుడ్‌బై చెప్పేసినట్లే అని తెలుస్తోంది. సెర్చ్ంజిన్ దిగ్గజం గూగుల్ కొత్త సదుపాయాన్ని పరీక్షిస్తోంది. తన సెర్చ్ంజన్ హోమ్‌పేజీలో 'ఏఐ మోడ్'ను జోడించనుంది. గూగుల్ హోమ్‌పేజీలోని వేర్వేరు ప్రదేశాల్లో ఈ బటన్ కనిపించినట్లు పలువురు యూజర్లు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. గూగుల్ సెర్చ్ంజన్ హోమ్‌పేజీలో గూగుల్ సెర్చ్‌తో పాటు 'ఐయామ్ ఫీలింగ్ లక్కీ'అనే మరో బటన్ కూడా దర్శనమిస్తుంటుంది. ఆ బటన్ స్థానంలో ఏఐ మోడ్‌ను పరిచయం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

గూగుల్ సెర్చ్ంజిన్ ప్రారంభం నుంచి బటన్ గూగుల్ అందుబాటులో ఉంది. గూగుల్ సెర్చ్‌లో ఏదైనా పదం సెర్చ్ చేసి ఈ బటన్ క్లిక్ చేస్తే వేర్వేరు సెర్చ్ రిజల్ట్స్ కాకుండా నేరుగా సంబంధిత వెబ్‌సైట్‌కు తీసుకెళ్తుంది. ఉదాహరణకు అని సెర్చ్ చేసి ఈ బటన్ క్లిక్ చేస్తే నేరుగా ఈనాడు.నెట్ వెబ్‌సైట్‌కు రీడైరెక్ట్ అవుతారు. మీ సెర్చ్‌ను వేగవంతం చేయడానికి ఈ బటన్‌ను తీసుకొచ్చారు. సెర్చ్ బాక్స్‌లో ఏ కీవర్డ్ ఎంటర్ చేయకుడా ఈ బటన్ క్లిక్ చేస్తే గూగుల్ డూడుల్ పేజీ ప్రత్యక్షమవుతుంది.

చాలా ఏళ్లుగా సెర్చ్ ఇంజిన్ హోమ్‌పేజీలో భాగంగా ఉన్న ఈ బటన్ స్థానంలో 'ఏఐ మోడ్' చాలామందికి తాజాగా కనిపించినట్లు తెలుస్తోంది. దీన్ని ప్రయోగాత్మకంగా గూగుల్ పరీక్షిస్తున్నట్లు అర్థమవుతోంది. అంటే ఇకపై ఏదైనా కీవర్డ్ ఎంటర్ చేసి 'ఏఐ మోడ్' ఎంచుకుంటే సంబంధిత వెబ్‌సైట్ కాకుండా ఏఐ సాయంతో సమాధానం ఇవ్వనుందన్నమాట. గూగుల్ ఈ ఫీచర్‌ను పరీక్షిస్తున్న విషయాన్ని సంస్థ ప్రతినిధి కూడా ధ్రువీకరించారు. అయితే, పూర్తిస్థాయిలో రోల్ అవుట్ చేయడంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. త్వరలో దీనిపై మరింత స్పష్టత రానుంది.



## రాజమౌళిని ఆటపట్టించిన రామ్‌చరణ్– ఎన్టీఆర్: ‘ఆర్ఆర్ఆర్ 2’పై స్పందించిన దర్శకుడు

రాజమౌళిని రామ్‌చరణ్, ఎన్టీఆర్ ఆటపట్టించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. అందులోనే.. ‘ఆర్ఆర్ఆర్ 2’పై స్పందించారు రాజమౌళి.

హీరోలు రామ్‌చరణ్ , ఎన్టీఆర్ , డైరెక్టర్ రాజమౌళి ఎంతో స్నేహంగా ఉంటారనే సంగతి తెలిసిందే. వారి అనుబంధాన్ని చాటే ఎన్నో వీడియోలు ఇప్పటికే నెట్టింట సందడి చేయగా.. తాజాగా మరో వీడియో బయటకు వచ్చింది. అందులో.. హీరోలిద్దరూ దర్శకుడిని ఆటపట్టిస్తూ కనిపించారు. ‘ఇప్పుడు ఆర్ఆర్ఆర్ 2’ చేస్తారా? అని ఒకరు అడగ్గా ‘ఎస్’ అని రాజమౌళి సమాధానమిచ్చారు. సంబంధిత వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ‘ఆర్ఆర్ఆర్ లైవ్ కాన్సర్ట్’లో చోటుచేసుకున్న దృశ్యాలవి. ఆ ఈవెంట్ లండన్‌లోని ప్రఖ్యాత రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో కొన్ని రోజుల క్రితం జరిగింది. ఈ ముగ్గురితోపాటు సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి తదితరులు హాజరయ్యారు. ‘ఆర్ఆర్ఆర్’ సీక్వెల్‌పై ఇప్పటికే పలుమార్లు సానుకూలంగా స్పందించారు రాజమౌళి. మరోవైపు, ఆ మూవీ కథా రచయిత, రాజమౌళి తండ్రి విజయేంద్రప్రసాద్ సైతం ‘ఆర్ఆర్ఆర్ 2’ తెరకెక్కే అవకాశాలున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

‘బాహుబలి 2’ తర్వాత ‘ఆర్ఆర్ఆర్’ రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో లైవ్ కాన్సర్ట్ చేసిన తొలి విదేశీ చిత్రంగా ‘బాహుబలి 2’ రికార్డు నెలకొల్పింది. ఆ తర్వాత ‘ఆర్ఆర్ఆర్’ నిలిచింది. రెండూ రాజమౌళి దర్శకత్వం వహించిన సినిమాలే కావడం విశేషం.

## అలాంటి దేశాల కోసం డబ్బు ఖర్చు చేయొద్దు: నిఖిల్

తుర్కియేను ఉద్దేశించి నటుడు నిఖిల్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. అలాంటి దేశాల కోసం డబ్బు ఖర్చు చేయొద్దన్నారు.

భారత్ - పాక్ ఉద్రిక్తతల వేళ తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ వ్యవహరించిన తీరుపై టాలీవుడ్ నటుడు నిఖిల్ అసహనం వ్యక్తంచేశారు. భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే దేశాల కోసం డబ్బు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. విహారయాత్రల కోసం ఆయా దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. ‘మంచి లేదా చెడు పాక్‌తో మేము సత్సంబంధాలు కొనసాగిస్తాం’ అంటూ ఎర్డోగాన్ చేసిన వ్యాఖ్యలపై ఒక నెటిజన్ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టాడు. దీనిని నిఖిల్ తాజాగా ఎక్స్ వేదికగా షేర్ చేశారు.

రణ్‌బీర్‌ను బాయ్‌కాట్ చేసే ధైర్యం ఎవరికీ లేదు: దర్శకుడు

“ఇంకా ఎవరైనా తుర్కియే వెళ్లాలనుకుంటున్నారా? దయచేసి ఒక్కసారి ఈ పోస్ట్ చూడండి. భారతీయులు ప్రతి ఏడాది తుర్కియేలో పెద్దమొత్తంలో ఖర్చు పెడుతుంటారు. మన దేశానికి వ్యతిరేకంగా వ్యవహరించే వారి కోసం మీ డబ్బు ఖర్చుపెట్టడం దయచేసి మానండి” అని నిఖిల్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ ను భారత్ చేపట్టగా.. ఆ సమయంలో పాకిస్థాన్‌కు తుర్కియే అనుకూలంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి జరిగిన తర్వాత ప్రపంచమంతా ఉగ్రవాదుల చర్యలను ఖండిస్తున్న సమయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ఎర్డోగాన్ కలిశారు. ఆ దేశానికి వత్తాసు పలికారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించలేదు సరికదా.. మృతిచెందిన పర్యాటకుల కుటుంబాలకు సానుభూతి కూడా వ్యక్తం చేయడానికి ఇష్టపడలేదు. ఎర్డోగాన్ ప్రభుత్వం తీరుపై మన దేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ‘బాయ్‌కాట్ తుర్కియే’ పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది.






## ‘కింగ్‌డమ్’ వాయిదా.. కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడంటే!

విజయ్ దేవరకొండ నటించిన తాజా చిత్రం ‘కింగ్‌డమ్’. ఈ సినిమా విడుదల మరోసారి వాయిదా పడింది.

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రానున్న చిత్రం ‘కింగ్‌డమ్’ . మే 30న విడుదల కావాల్సిన ఈ సినిమా తాజాగా వాయిదా పడింది. దీన్ని జులై 4న విడుదల చేయనున్నట్లు టీమ్ తెలిపింది. ఈమేరకు ఓ నోట్‌ను పంచుకుంది.

‘‘అనుకున్న సమయానికి సినిమాను రిలీజ్ చేయాలని ఎంతో ప్రయత్నించాం. కానీ, ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా దీన్ని వాయిదా వేస్తున్నాం. ఇలాంటి సమయంలో ప్రచారాలు, సెలబ్రేషన్స్ అంటూ సందడి చేయకూడదు. అందుకే మేం సినిమా జులై 4న ప్రపంచవ్యాప్తంగా మీ ముందుకు తీసుకురానున్నాం. మీ అందరూ సహకరిస్తారని ఆశిస్తున్నాం’’ అని టీమ్ తెలిపింది.

మొదట ఈ సినిమాను మార్చిలో విడుదల చేయాలని భావించారు. మే 30కు వాయిదా పడింది. ఇప్పుడు మరోసారి జులై 4కు వెళ్లింది. విజయ్ సరసన భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్న ఈ సినిమాలోని పాటలు ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంటున్నాయి. ఇటీవలే ఇందులో ‘హృదయం లోపల’ అంటూ సాగే పాటని విడుదల చేయగా సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ‘కింగ్‌డమ్’లో విజయ్ దేవరకొండ గూఢచారిగా కనిపించనున్నారు.

## తప్పుడు ప్రచారాలు నాకు నచ్చవు.. అందుకే నేనే నిజం చెప్పా: సోనాలి బింద్రే

**ఒకప్పటి స్టార్ కథానాయిక సోనాలి బింద్రే ఒకానొక సమయంలో క్యాన్సర్ బారిన పడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో తాను తీసుకున్న ఓ నిర్ణయం గురించి తాజాగా ఆమె మాట్లాడారు.**

**ముంబయి:** ఒకప్పటి స్టార్ కథానాయిక సోనాలి బింద్రే కొన్నేళ్ల క్రితం క్యాన్సర్ బారిన పడిన విషయం తెలిసందే. మెటాస్టాటిక్ క్యాన్సర్‌తో తాను ఇబ్బందిపడుతున్నానని 2018లో ఆమే స్వయంగా ప్రకటించారు. మనోధైర్యంతో చికిత్స తీసుకొని ఆ మహమ్మారి నుంచి బయటకు వచ్చి ఎంతో మందిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తాను క్యాన్సర్ బారిన పడినట్లు ప్రకటించడంపై మాట్లాడారు. అలా చేయడం వెనుక ఒక బలమైన కారణం ఉందన్నారు.

‘‘క్యాన్సర్‌తో పోరాడుతున్నానని తెలిసిన సమయంలో ఆ విషయాన్ని అందరితో చెప్పాలనుకోలేదు. కానీ, అప్పట్లో నేనొక ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్నా. ప్రతి వారం ఒక కొత్త ఎపిసోడ్ టెలికాస్ట్ అవుతుండేది. అదే సమయంలో నేను ట్రీట్‌మెంట్ తీసుకోవాల్సి వచ్చింది. చికిత్స కోసం వెళ్లినప్పుడు.. అప్పటివరకూ కనిపించిన నేను ఒక్కసారిగా మాయమయ్యానని ఒక్కొక్కరూ ఒక్కో మాదిరిగా మాట్లాడుకుంటారు. నా గురించి ఇష్టం వచ్చినట్లు ప్రచారాలు చేస్తారు. సోషల్‌మీడియాలో గాసిప్స్ క్రియేట్ చేయవచ్చు. వాటి వల్ల నా కుమారుడు, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఇబ్బందిపడొచ్చు. అది నాకు ఏమాత్రం నచ్చదు. అందుకే నా ఆరోగ్య పరిస్థితి గురించి నేనే ధైర్యంగా బయటపెట్టాను’’ అని ఆమె చెప్పారు. ఇదే ఇంటర్వ్యూలో ఆమె తన సినీ కెరీర్ గురించి మాట్లాడారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన సమయంలో లుక్స్ పరంగా తాను ఎన్నో అవకాశాలు కోల్పోయానని అన్నారు.

క్యాన్సర్ నుంచి కోలుకున్న సోనాలి బింద్రే ఆ మహమ్మారి గురించి అవగాహన కల్పిస్తున్నారు. క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌లో తాను ఎన్నో జీవిత పాఠాలు నేర్చుకున్నానని గతంలో పలు ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు. ‘‘క్యాన్సర్ బారిన పడి కోలుకున్న వారి జీవితాలు.. క్యాన్సర్‌కి ముందు క్యాన్సర్‌కి తర్వాత అన్నట్లు ఉంటాయి. మనిషి తన జీవితంలో ఏదో ఒక దాని వల్ల పాఠాలు నేర్చుకోవాలి. నేను దీని (క్యాన్సర్) నుంచి కొన్ని పాఠాలు నేర్చుకున్నా. మన జీవిత ప్రయాణం ఎప్పుడూ ఆగిపోకూడదు. ట్రీట్‌మెంట్ తీసుకున్న రోజులు నా జీవితంలో అత్యంత కష్టమైన దశ’’ అని ఆమె గతంలో చెప్పారు.





## పారితోషికం పెంచేసిన యంగ్ బ్యూటీ.. ఏకంగా

హీరోయిన్లు ఎప్పుడు ఎలా ఫేమస్ అవుతారో చెప్పలేం. కొందరు ఏళ్లకు ఏళ్లు కష్టపడినా గుర్తింపు రాదు. మరికొందరు ఒక్క మూవీకే ఓవర్ నైట్ స్టార్ అయిపోతుంటారు. 'ప్రేమలు' బ్యూటీ మమిత ఈ కోవలోకే వస్తుంది. తెలుగు, తమిళంలో వరస సినిమాలు చేస్తున్న ఈమె ఇప్పుడు రెమ్యునరేషన్ గట్టిగానే పెంచేసినట్లు తెలుస్తోంది.

మలయాళంలో తొలుత పలు సినిమాల్లో సహాయ పాత్రలు చేసిన మమితకు 'ప్రేమలు' మూవీతో హీరోయిన్ గా బ్రేక్ దొరికింది. అటు సొంత భాషతో పాటు తెలుగులోనూ మంచి క్రేజ్ దక్కించుకుంది. ప్రస్తుతం ఈమె మైత్రీ మూవీ మేకర్స్ తీస్తున్న 'డ్యూడ్', దళపతి విజయ్ లేటెస్ట్ చిత్రాల్లో నటిస్తోంది.

ఇదివరకు హీరోయిన్ గా ఒక్కో సినిమాకు రూ.50 లక్షల్లోపే రెమ్యునరేషన్ అందుకున్న మమిత.. ఇప్పుడు 'డ్యూడ్' కోసం రూ.70 లక్షలకు పైనే అందుకుంటోందట. దళపతి విజయ్ తో చేస్తున్న జన నాయగణ్ కోసమైతే ఏకంగా రూ.కోటి పారితోషికం అందుకుందట.

ఒకవేళ ఈ రెండు సినిమాలు గనక హిట్ అయితే తెలుగుతో పాటు తమిళంలోనూ క్రేజ్ రావడం గ్యారంటీ. అప్పుడు ఇంకాస్త రెమ్యునరేషన్ పెంచినా సరే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ప్రస్తుతం ఈ రెండు కాకుండా మరో తమిళ మూవీ కూడా మమిత చేతిలో ఉంది.



## కోహ్లి స్థానంలో అతడే సరైనోడు..
## ఇంగ్లండ్‌కు పంపండి: కుంబ్లే

ఇంగ్లండ్ పర్యటనకు ముందు టీమిండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికి అందరికి షాకిచ్చిన సంగతి తెలిసిందే. తొలుత కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించగా.. ఆ తర్వాత వారం రోజులకే విరాట్ కోహ్లి కూడా తన నిర్ణయాన్ని వెల్లడించింది. దీంతో యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది.

ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ వచ్చే వారం ప్రకటించింది. అయితే ఇన్నాళ్లు విరాట్ కోహ్లి ఆడిన నాలుగో స్థానాన్ని ఎవరితో భర్తీ చేస్తారన్న ప్రశ్న అందరిలోనూ మెదులుతోంది. ఈ క్రమంలో భారత మాజీ కెప్టెన్ కెప్టెన్ అనిల్ కుంబ్లే కీలక వ్యాఖ్యలు చేశాడు.

టెస్ట్ ఫార్మాట్‌లో విరాట్ కోహ్లి బ్యాటింగ్ స్థానాన్ని కరుణ్ నాయర్ భర్తీ చేయగలడని కుంబ్లే జోస్యం చెప్పాడు. కాగా ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు కరుణ్ నాయర్ ఎంపికయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించడంతో పాటు ఇంగ్లండ్ కౌంటీల్లో ఆడిన అనుభవం ఉండడంతో నాయర్‌ను తిరిగి జట్టులోకి తీసుకోవాలని సెలక్టర్లు భావిస్తున్నారంట.

"కరుణ్ నాయర్ దేశవాళీ క్రికెట్‌లో చక్కటి ప్రదర్శన కనబరిచాడు. అతడు భారత జట్టులోకి తిరిగి రావడానికి అర్హుడు. అతడు నాలుగో స్థానంలో ఆడొచ్చు. ఎందుకంటే భారత్‌కు ఇంగ్లండ్‌లో ఆడిన అనుభవం ఉన్న ఆటగాడు కావాలి. కరుణ్‌కు ఇంగ్లండ్‌లో కౌంటీ క్రికెట్ అనుభవం ఉంది.

అతడికి అక్కడి పరిస్థితులు ఎలా ఉంటాయో బాగా తెలుసు. కరుణ్ వయస్సు పరగా 30 ఏళ్లు దాటిండొచ్చు. కానీ అతడు ఇంకా చాలా యంగ్ కన్పిస్తున్నాడు. ఇంకా చాలా కాలం పాటు క్రికెట్ ఆడే సత్తా ఉంది. కాబట్టి కోహ్లి స్థానంలో అతడే సరైనోడు" అని ఈఎస్పీఎన్ క్రిక్ ఇన్ఫో ఇచ్చిన ఇంటర్వ్యూలో కుంబ్లే పేర్కొన్నారు.

కాగా కరుణ్ నాయర్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. రంజీ ట్రోఫీ 202425లో విదర్భ ఛాంపియన్‌గా నిలవడంలో కరుణ్‌ది కీలక పాత్ర. ఈ టోర్నీలో 16 ఇన్నింగ్స్‌లలో 53.93 సగటుతో 863 పరుగులు చేసి నాలుగో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. నాయర్ చివరసారిగా భారత జట్టు తరపున 2017లో ఆడాడు. కాగా వీరేంద్ర సెహ్వాగ్ తర్వాత టెస్టుల్లో ట్రిపుల్ సెంచరీ సాధించిన ఏకైక భారత ఆటగాడిగా కరుణ్ నాయర్ కొనసాగుతున్నాడు.

**ఇంగ్లండ్‌తో సిరీస్‌కు భారత జట్టు(అంచనా)**
కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్, ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి, సాయి సుదర్శన్, రవీంద్ర జడేజా, రిషభ్ పంత్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, మహమ్మద్ షమీ, మహమ్మద్ సిరాజ్, అర్‌ష్‌దీప్ సింగ్.






## బంగ్లాదేశ్ క్రికెటర్‌కు ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డు..

బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మీరాజ్‌కు తొలిసారి ప్రతిష్టాత్మక ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు దక్కింది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అత్యుత్తమ ప్రదర్శనకు గాను మెహిదీ హసన్‌కు ఈ అవార్డు దక్కింది. గత నెలలో సొంతగడ్డపై జింబాబ్వేతో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో మెహిదీ హసన్ ఆల్ రౌండ్ షోతో అదరగొట్టాడు.

ఈ సిరీస్‌లో 27 ఏళ్ల మెహిదీ 116 పరుగులతో పాటు 15 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డు మిరాజ్‌కు వరించింది. ఈ అవార్డు సాధించిన మూడవ బంగ్లాదేశ్ ఆటగాడిగా మెహిదీ నిలిచాడు. అతడి కంటే ముందు వెటరన్ ఆటగాళ్లు ముష్పికర్ రహీం, షకీబ్ అల్ హసన్ ఈ అవార్డును అందుకున్నారు.

కాగా ఈ అవార్డు కోసం మెహిదీ హసన్‌తో పాటు జింబాబ్వే స్పీడ్ స్టార్ బ్లెస్సింగ్ ముజారబానీ, బెన్ సియన్స్ పోటీ పడ్డారు. అయితే వీరిద్దరికంటే మెహిదీ వ్యక్తిగత ప్రదర్శన పరంగా ముందుండడంతో ఈ ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డును గెలుచుకున్నాడు. మరోవైపు మహిళల విభాగంలో ఈ అవార్డును స్కాట్లాండ్ కెప్టెన్ కాథరిన్ బ్రైస్ సొంతం చేసుకుంది.

గత నెలలో జరిగిన వరల్‌డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో కాథరిన్ బ్రైస్.. బ్యాట్, బంతితో అద్భుతంగా రాణించింది. 293 పరుగులతో టోర్నమెంట్ లీడింగ్ రన్ స్కోరర్‌గా నిలిచిన బ్రైస్.. బౌలింగ్‌లోనూ 6 వికెట్లు పడగొట్టింది. దీంతో వెస్టిండీస్ కెప్టెన్ హీలీ మాథ్యూస్, పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సానాను వెనక్కి నెట్టి ఈ అవార్డును కాథరిన్ సొంతం చేసుకుంది.




# నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం..

భారత స్టార్ జావెలిన్ త్రోయర్, ఒలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం లభించింది. నీరజ్ చోప్రాకు టెరిటోరియల్ ఆర్మీలో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాను భారత సైన్యం ప్రధానం చేసింది . ఈ మేరకు బుధవారం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గెజిట్ జారీ చేసింది. నీరజ్ కొత్త ర్యాంక్ ఏప్రిల్ 16, 2025 నుండి అమల్లోకి వచ్చింది. "1948 టెరిటోరియల్ ఆర్మీ రెగ్యులేషన్స్‌లోని పేరా 31 ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని నీరజ్ చోప్రాకు లెఫ్టినెంట్ కల్నల్ గౌరవ ర్యాంకును ప్రధానం చేయడానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారని" రక్షణ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.
కాగా నీరజ్ ముందుగా 2016 నయీబ్ సుబేదార్ హోదాలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్‌గా భారత సైన్యంలో చేరాడు. ఆ తర్వాత టోక్యో ఒలింపిక్స్2021లో గోల్డ్ మెడల్ సాధించడంతో సుబేదార్‌గా పదోన్నతి పొందాడు. కాగా నీరజ్ చోప్రా.. ఇండియన్ అథ్లెటిక్స్ హిస్టరీలో తన పేరును సువర్ణ అక్షరాలతో లిఖించుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కు బంగారు పతకాన్ని తీసుకొచ్చిన నీరజ్.. పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకంతో సత్తాచాటాడు.
ఈ క్రమంలోనే గోల్డెన్ బాయ్‌కు లెఫ్టినెంట్ కల్నల్ హోదా లభించింది. కాగా దేశానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ ప్రత్యేక హోదా భారత సైన్యం సత్కరిస్తోంది. ఈ గౌరవ హోదా పొందిన ఆరో క్రీడాకారుడిగా నీరజ్ నిలిచాడు. నీరజ్ కంటే ముందు ప్రముఖ షూటర్లు అభినవ్ బింద్రా, విజయ్ కుమార్.. దిగ్గజ క్రికెటర్లు కపిల్ దేవ్, సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోని ఈ అరుదైన గౌరవాన్ని పొందారు.

## ఆరేళ్ల తర్వాత విండీస్‌తో టీ20, వన్డే సిరీస్.. జట్టును ప్రకటించిన ఐర్లాండ్




ఐర్లాండ్ క్రికెట్ జట్టు స్వదేశంలో ఆరేళ్ల తర్వాత తొలిసారి వెస్టిండీస్‌తో తలపడేందుకు సిద్దమైంది. వైట్ బాల్ సిరీస్‌లు ఆడేందుకు విండీస్ జట్టు ఐర్లాండ్ పర్యటనకు రానుంది. ఈ టూర్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్ జరగనుంది. ఈ క్రమంలో విండీస్‌తో వన్డే, టీ20 సిరీస్‌లకు 14 మంది సభ్యులతో కూడిన తమ జట్టును క్రికెట్ ఐర్లాండ్ బుధవారం ప్రకటించింది. రెండు ఫార్మాట్లలోనూ ఐర్లాండ్ జట్టు కెప్టెన్‌గా పాల్ స్టిర్లింగ్ ఎంపికయ్యాడు. అదేవిధంగా ఈ జట్లలో ఎక్కువగా యువ ఆటగాళ్లకు ఐరిష్ సెలక్టర్లు చోటు కల్పించారు. టాప్‌ఆర్డర్ బ్యాటర్ కేడ్ కార్మైకేల్, పేసర్ టామ్ మేయెస్‌లు తొలిసారి ఐర్లాండ్ వన్డే జట్టులో చోటు దక్కించుకోగా.. వికెట్ కీపర్ బ్యాటర్ లియామ్ మెక్‌కార్తీని టీ20 జట్టుకు సెలక్టర్లు ఎంపిక చేశారు. యువ ఆటగాళ్లతో పాటు హ్యారీ టెక్టర్, జోష్ లిటిల్, జార్జ్ డాక్రెల్, కర్టిస్ కాంఫర్ వంటి సీనియర్ ఆటగాళ్లు కూడా ఈ జట్టులో ఉన్నారు. మే 21న డబ్లిన్ వేదికగా ఇరు జట్ల మధ్య జరగనున్న తొలి టీ20తో విండీస్ జట్టు ఐర్లాండ్ పర్యటన ప్రారంభం కానుంది.
**విండీస్‌తో వన్డే సిరీస్‌కు ఐరిష్ జట్టు:** పాల్ స్టిర్లింగ్ (కెప్టెన్), ఆండ్రూ బాల్బిర్నీ, కర్టిస్ కాంఫర్, కేడ్ కార్మైకేల్, జార్జ్ డాక్రెల్, మాథ్యూ హంఫ్రీస్, జోష్ లిటిల్, టామ్ మేయెస్, ఆండ్రూ మెక్‌బ్రైన్, బారీ మెక్‌కార్తీ, లియామ్ మెక్‌కార్తీ, హ్యారీ టెక్టర్, లోర్కాన్ టక్కర్, క్రెయిగ్ యంగ్
**విండీస్‌తో టీ20 సిరీస్‌కు ఐరిష్ జట్టు:** పాల్ స్టిర్లింగ్ (కెప్టెన్), మార్క్ అడైర్, రాస్ అడైర్, కర్టిస్ కాంఫర్, గారెత్ డెలానీ, జార్జ్ డాక్రెల్, మాథ్యూ హంఫ్రీస్, జోష్ లిటిల్, బారీ మెక్‌కార్తీ, లియామ్ మెక్‌కార్తీ, హ్యారీ టెక్టర్, లోర్కాన్ టక్కర్, బెన్ వైట్, క్రెయిగ్ యంగ్




## తెలంగాణ జిమ్నాస్ట్ నిష్కా అగర్వాల్‌కు స్వర్ణం

ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2025లో తెలంగాణ యువ జిమ్నాస్ట్ నిష్కాఅగర్వాల్ స్వర్ణ పతకంతో మెరిసింది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ గేమ్స్‌లో హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల నిష్కా ఆర్టిస్టిక్స్ జిమ్నాస్టిక్స్ ఆల్ అరౌండ్ విభాగంలో విజేతగా నిలిచింది. నిష్కా 44.333 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని పొందింది. అనుష్క పాటిల్ (మహారాష్ట్ర; 42.067 పాయింట్లు) రజతం, సారా రవూల్ (మహారాష్ట్ర; 41.233 పాయింట్లు) కాంస్యం సాధించారు.

# ఓపెనర్‌గా కేఎల్ రాహుల్..
# నాలుగో స్థానంలో 'కొత్త' ఆటగాడు!

**మేనేజ్‌మెంట్‌కు వసీం జాఫర్ సూచనలు**

భారత టెస్టు జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు రాబోతున్నాయి. ఇన్నాళ్లుగా ఓపెనర్‌గా ఉన్న కెప్టెన్ రోహిత్ శర్మతో సంప్రదాయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. మరోవైపు.. మిడిలార్డర్‌లో కీలకమైన నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగే దిగ్గజం విరాట్ కోహ్లి కూడా రిటైర్మెంట్ ప్రకటించాడు.

ఈ నేపథ్యంలో వీరిద్దరి స్థానాలు భర్తీ చేసే ఆటగాళ్లు ఎవరన్న అంశంపై చర్చ జరగుతోంది. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్ వసీం జాఫర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఓపెనింగ్ జోడీగా కేఎల్ రాహుల్ యశస్వి జైస్వాల్ ను కొనసాగించాలని సూచించాడు. బోర్డర్ గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో అయితే, నాలుగో స్థానానికి మాత్రం వసీం జాఫర్ కొత్త ఆటగాడిని ఎంపిక చేశాడు. కాగా గతేడాది ఆస్ట్రేలియా పర్యటనలో బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భాగంగా రోహిత్ శర్మ తొలి టెస్టుకు దూరమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేఎల్ రాహుల్ జైసూతో కలిసి భారత ఇన్నింగ్స్ ఆరంభించాడు. రోహిత్ తిరిగి వచ్చిన తర్వాత కూడా వీరే ఓపెనర్లుగా కొనసాగారు. ఈ నేపథ్యంలో వసీం జాఫర్ న్యూస్18తో మాట్లాడుతూ.. "బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో కేఎల్ రాహుల్ యశస్వి జైస్వాల్ ఓపెనర్లుగా రాణించారు. కాబట్టి కేఎల్ అదే స్థానంలో కొనసాగితే బాగుంటుంది. నిలదొక్కుకున్న జోడీని విడదీయడం వల్ల నష్టమే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. నాలుగో స్థానంలో గిల్!
ఇక శుభ్‌మన్ గిల్ విషయానికొస్తే.. అతడు వైట్ బాల్ క్రికెట్‌లో ఓపెనర్‌గా వస్తున్నాడు. కానీ టెస్టు క్రికెట్‌లో మాత్రం అతడిని మూడు నుంచి నాలుగో స్థానానికి పంపితే బాగుంటుంది. మూడో స్థానంలో సాయి సుదర్శన్‌ను ఆడించాలి. సుదీర్ఘకాలం వన్‌డౌన్‌లో ఆడిస్తే జట్టుకు ఉపయోగకరంగా ఉంటుంది" అని పేర్కొన్నాడు. కాగా కేఎల్ రాహుల్ టీమిండియా తరఫున ఓపెనర్‌గా 83 ఇన్నింగ్స్‌లో 2803 పరుగులు సాధించాడు. ఇందులో ఏడు శతకాలు ఉన్నాయి.

**ఓపెనర్లుగా ఇలా**
ఇక నాలుగో స్థానంలో రెండు ఇన్నింగ్స్ ఆడిన కేఎల్.. 108 పరుగులు చేయగలిగాడు. మరోవైపు.. శుబ్‌మన్ గిల్ 30 ఇన్నింగ్స్‌లో మూడో స్థానంలో వచ్చి 1019 పరుగులు చేశాడు. ఓపెనర్‌గా 29 ఇన్నింగ్స్‌లో 874 పరుగులు చేసిన ఈ కుడిచేతి వాటం బ్యాటర్.. ఇంత వరకు ఒక్కసారి కూడా నాలుగో స్థానంలో ఆడలేదు.

కాగా రోహిత్ శర్మ విరాట్ కోహ్లిల నిష్క్రమణ తర్వాత టీమిండియా తొలిసారి ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 202527 సైకిల్‌లో తొలి సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల్లో తలపడనుంది. ఈ టూర్ నుంచి భారత టెస్టు జట్టు కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్ పగ్గాలు చేపట్టే అవకాశం ఉంది. జూన్ 20 నుంచి ఈ సిరీస్ మొదలుకానుంది.

